

రావత్ దూకుడు..

ఇండియా ఏ జట్టు బ్యాటర్ రావత్ మెరిశాడు. వీరోచిత సెంచరీతో కదం తొక్కాడు. 8లో



సమీపిస్తున్న రబీ

రబీ సీజన్ సమీపిస్తున్నా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు. తగిన చర్యలు చేపట్టడం లేదు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.7°/ 22.9°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టంపై స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు గర్భిణుల వివరాలు తప్పక నమోదు చేయాలన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో జరిగే కాన్పుల వివరాలు మునిసిపాలిటీ వారికి తెలియజేయాలన్నారు. స్టాటిస్టికల్ అధికారి మహ్మద్ రఫి మాట్లాడుతూ హెచ్‌ఎంఎస్ ఆన్‌లైన్ రిపోర్టు తప్పకుండా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ నారాయణ స్వామి, డీఎంఓ ఓబులు, డెమో తాగ్యరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకునేందుకు మరోమారు గడువు పొడిగించారు. ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వసతి సదుపాయం లేని మోడల్ స్కూళ్ల 8వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు చొరవ తీసుకుని వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులతో దరఖాస్తు చేయించేలా చూడాలని ఆదేశించారు. ఓసీ,బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏటా రూ. 12 వేల స్కాలర్‌షిప్పును ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత

పామిడి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిని అధికారులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి పట్టణ సమీపంలోని పెన్నానది నుంచి ఓ 'పచ్చ' నేత ఆధ్వర్యంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎస్. శ్రీధర్‌మూర్తి, సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో దాడి చేసి ఇసుకాసురులను పట్టుకున్నారు. తాము పట్టా భూమి నుంచి ఇసుక తరలిస్తున్నట్లు రవాణాదారులు బుకాయించగా.. అందుకు అనుమతులు కావాలని అధికారులు సమాధానమిచ్చారు. శుక్రవారం అనుమతి కాపీని సమర్పిస్తామని చెప్పడంతో వదిలిపెట్టారు. అయితే, రాత్రి పూట దొంగచాటుగా ఇసుక రవాణా చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.


అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు



దుకాణంలో విక్రయించిన అంగన్‌వాడీ గుడ్లు

శింగనమల: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకులు పక్కదారి పడుతున్నాయి. కొందరు కార్యకర్తల చేతివాటంతో మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఇలాంటి ఘటనే శింగనమలలో జరిగింది. అంగన్‌వాడీకి అందించిన కోడిగుడ్లను దుకాణంలో విక్రయిస్తుండడంతో పలువురు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విషయం వైరల్ కావడంతో స్పందించిన సీడీపీఓ ఉమాశంకరమ్మ గురువారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలో ఉండే ఐదు అంగన్ వాడీ కేంద్రాలనూ తనిఖీ చేశారు. కోడిగుడ్ల రికార్డులు పరిశీలించారు. నాలుగో అంగన్‌వాడీ సెంటర్‌కు చెందిన ఓ పిల్లవాడికి గుడ్లు అందజేయగా, కుటుంబీకులు వాటిని మరొకరికి విక్రయించినట్లు తెలిసింది. దీంతో సీడీపీఓ వారిని పిలిపించి మాట్లాడారు. అంగన్‌వాడీ సరుకులను విక్రయించడం సరికాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా దీనిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

కోతల బాబు.. చేతలు శూన్యం



- ఎన్నికల ప్రచారంలో హామీలతో ఊదరగొట్టిన చంద్రబాబు
- తండ్రి బాటలో లోకేష్ కూడా జిల్లా ప్రజలకు అలవిగాని హామీలు
- వందరోజులైనా అందులో ఒక్కటీ అమలు కాని వైనం
- ఓట్లేయించుకుని నిండా ముంచారని జిల్లావాసులు ఆవేదన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ముందు జిల్లాకు అలవిగాని హామీలు ఇచ్చిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు అధికారంలోకి వచ్చాక పత్తా లేకుండా పోయారు. ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా ఇచ్చిన ఏ హామీకి దిక్కు లేకుండా పోయింది. వర్షాభావంతో అల్లాడుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లా కూటమి సర్కారు కోరల్లో ఇరుక్కుని అల్లాడుతోంది. రైతులు మొదలు సామాన్యులు, ఉద్యోగులు, వ్యాపారులు, కులవృత్తుల వాళ్లు... ఒకరేంటి అందరికీ చుక్కలు చూపుతున్నారు. 'మీకు రూ. లక్షల లబ్ధి చేకూరుస్తాం, అధికారంలోకి రాగానే లక్షాధికారుల్ని చేస్తాం' అన్న చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ హామీలు తుంగలో తొక్కారు. తండ్రీకుమారుల మాటలను నమ్మి ఓట్లేసిన లక్షలాది మంది ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

హామీలు గుర్తున్నాయో లేదో..?

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయదుర్గం, కళ్యాణదుర్గంలో పర్యటించిన చంద్రబాబు స్థానికులకు ఎన్నో హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీపీ (భైరవాని తిప్ప) ప్రాజెక్టుకు నీళ్లిచ్చి, ఇక్కడి భూములను సస్యశ్యామలం చేస్తామన్నారు. రాయదుర్గంలో గార్మెంట్ పరిశ్రమను ఆదుకుంటామన్నారు. కార్మికులకు ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. కానీ, ఇప్పటికీ వాటిపై దృష్టి సారించ లేదు. కళ్యాణదుర్గంలో అయితే సూపర్ సిక్స్ పథకాలపై ఢంకా మోగించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహాశక్తి పథకం ప్రవేశపెట్టి ఇంట్లో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అందిస్తామన్నారు. ప్రపంచంలోని ప్రఖ్యాత కంపెనీలను తీసుకొచ్చి ఇంటి నుంచే పని చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తామనీ, ప్రతి మండలంలో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచే పనిచేసే సౌలభ్యం కల్పిస్తామనీ హామీ ఇచ్చారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని, ఒక్కొక్కరికి రూ.15 వేలు అందిస్తామని చెప్పిన ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి వంద రోజులైనా అసలు నోరే మెదపడం లేదు.

శింగనమలవాసులకు కుచ్చుటోపీ..

శింగనమల నియోజకవర్గవాసులకైతే చంద్రబాబు లేనిపోని ఆశలు కల్పించారు. బుక్కరాయసముద్రం ఎన్నికల ప్రచార సభలో వరాల జల్లు కురిపించారు. గార్లదిన్నె మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు, ఉల్లికల్లుకు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ, చాగల్లు రిజర్వాయర్ రూ.168 కోట్ల మంజూరు, శింగనమలలో అంబేడ్కర్ భవన నిర్మాణం, మిడ్ పెన్నార్ రిజర్వాయర్ నిర్వహణకు రూ.3 కోట్ల నిధులు, సుబ్బరాయ సాగర్ వాటర్ పైప్ లైన్ పనులకు రూ. 250 కోట్లు అందించడంతో పాటు గార్లదిన్నె, శింగనమల మండల కేంద్రంలో ముస్లిం షాదీఖానాల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తామన్న చంద్రబాబు ఇప్పటికీ వాటిని పట్టించుకుంటే ఒట్టు.

తండ్రి బాటలోనే నారా లోకేష్..

తానేం తక్కువా అన్నట్లు తండ్రి చంద్రబాబు బాటలోనే ఆయన కుమారుడు లోకేష్ కూడా ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించారు. కళ్యాణదుర్గం, అనంతపురం, ఉరవకొండలో 'యువగళం పాదయాత్ర'లో భాగంలో లోకేష్ పర్యటించారు. అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థికీ 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామన్నారు. రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ కింద పరికరాలివ్వడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. బీసీల కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేయడంతో పాటు ఆదరణ పథకం కింద రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. పెళ్లి కానుక కింద బీసీలకు నగదు అందజేయడంతో పాటు పర్మినెంట్ క్యాస్ట్ సర్టిఫికెట్లు అందిస్తామని, పెండింగ్‌లో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేస్తామని చెప్పిన లోకేష్.. నేడు పట్టించుకోవడం లేదు. స్వయంగా తండ్రీకుమారులిద్దరూ హామీలిస్తే నమ్మామని, అధికారంలోకి వచ్చాక ఇలా చేస్తారని అనుకోలేదని జిల్లా ప్రజలు నేడు నిట్టూరుస్తున్నారు.

అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారు



కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతోంది. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఎన్నో హామీలిచ్చారు. నేటికీ అందులో ఒక్కటి కూడా అమలు కాలేదు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, గద్దెనెక్కాక ప్రజలకు టోపీ పెట్టడం చంద్రబాబుకు అలవాటే. ఇప్పుడు వరదలు అంటున్నారు.. ప్రజలు హామీల గురించి అడిగితే విజయవాడ వరద బాధితులంటూ ఇంకో రెండేళ్లు కాలం వెళ్లదీస్తారు. ఆయన హామీలు అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

– హనుమంతరాయుడు, కదిరిదేవరపల్లి గ్రామం,కంబదూరు మండలం


ఇంత బాదుడు ఎన్నడూ చూడలేదు

కళ్యాణదుర్గం పర్యటనలో చంద్రబాబు ఇచ్చిన హామీలు (ఈనాడు దినపత్రిక క్లిప్పింగ్)

మాట నిలబెట్టుకోవాలి



గత ఎన్నికల ముందు ఉరవకొండలో చంద్రబాబు ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉరవకొండ నియోజకవర్గాన్ని సశ్యశామలం చేస్తామని ప్రకటించారు. హంద్రీనీవా కింద డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేసి నియోజకవర్గంలోని 80 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలి. ఆయకట్టు రైతులకు ఆనందం పంచాలి.

– ఓబన్న, మూలగిరిపల్లి గ్రామం, ఉరవకొండ

టమాట జాక్‌పాట్!

- ఎగబాకుతున్న టమాట ధరలు
- మార్కెట్‌లో గురువారం కిలో రూ.46 పలికిన వైనం



మార్కెట్‌కు వచ్చిన టమాట బాక్సులు

అనంతపురం అగ్రికల్చర్: టమాట ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. గురువారం స్థానిక కక్కలపల్లి మండీలో నాణ్యమైన టమాట కిలో రూ.46 పలకడం విశేషం. రెండో రకం కిలో రూ.36, సీ-గ్రేడ్ టమాట కిలో రూ.26 ప్రకారం పలికాయి. నెలన్నర రోజులుగా నాణ్యమైనది కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య పలకగా, కనిష్టం రూ.10 మేర అమ్ముడుపోయాయి. ఆగస్టు రెండు, మూడు వారాల్లో ధరలు భారీగా పడిపోవడంతో రైతులు నష్టపోయారు. దానికి తోడు వర్షాలు రావడంతో తేమ, మచ్చ అంటూ రోజూ 60 నుంచి 120 టన్నుల వరకు 'నోసేల్' పేరుతో కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో రైతులకు కనీసం ఖర్చులు కూడా దక్కలేదు. చాలా మంది రోడ్ల పక్కన పడేసి ఉత్తచేతులతో ఇంటిముఖం పట్టారు. అయితే వారం రోజులుగా పరిస్థితి మారింది. మార్కెట్‌కు సరుకు కూడా కొంత తగ్గింది. ఆగస్టుతో పాటు ఈనెల మొదటి వారం వరకు రోజూ 3,500 టన్నుల నుంచి గరిష్టంగా 4,800 టన్నుల వరకు అమ్ముడుబోయాయి. ఇటీవల కాలంలో 2 వేల నుంచి 3 వేల టన్నుల వరకు మార్కెట్‌కు వస్తోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. గత రెండు నెలల్లో పోల్చితే గురువారం కేవలం 1,200 టన్నులే రావడంతో ఒక్కసారిగా ధర భారీగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. మొదటి దఫా సాగు చేసిన తోటల్లో కోతలు పూర్తి కావడం, పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి సరుకు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం కోత దశల్లో ఉన్న టమాటకు మంచి ధర లభిస్తోంది. రైతుల పాలిట జాక్‌పాట్‌లా మారిన టమాటకు ఎప్పుడు ధరలు ఉంటాయో ఎప్పుడు పతనమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదో ఒక రోజు మంచి ధరలు దక్కకపోతాయా అనే ఆలోచనతో రైతులు మాత్రం టమాట జూదాన్ని వదిలే పరిస్థితి కనిపించడం లేదు.

నేడు స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. గతంలో రెండు రోజుల పాటు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించేవారు. అయితే ఈసారి ఒకే రోజు అన్ని సంఘాల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/వ్యవసాయం/విద్య, వైద్య/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు జెడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఆయా స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...?

ఏడు నెలల తరువాత జెడ్పీ స్థాయీ సంఘాలు నిర్వహిస్తుండడం గమనార్హం. గతంలో ఫిబ్రవరి 29న సమావేశాలు నిర్వహించారు. స్థాయీ సంఘ సమావేశాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి (60 రోజులు దాటకుండా) నిర్వహించాలని పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. అయితే గత సమావేశంలో అప్పటి సీఈఓ/ఐఏఎస్ అధికారిణి వైభోమ్ నిదియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి వ్యవహార శైలిని తప్పుబడుతూ సభ్యులందరూ మూకుమ్మడిగా సమావేశాలు బహిష్కరించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రావడంతో ఇదే అదనుగా భావించి అధికారులు కూడా స్థాయీ సంఘాల సమావేశాల నిర్వహణను గాలికి వదిలేశారు. మరో వైపు ఫిబ్రవరి 29న సభ్యులు వాకౌట్ చేసినా... ఆ సమావేశాన్ని నిర్వహించినట్లు జెడ్పీ అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించడంపై పంచాయతీరాజ్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఇటీవల జెడ్పీ సీఈఓగా బాధ్యతలు తీసుకున్న ఓబుళమ్మ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో మాట్లాడారు. ఈ క్రమంలోనే స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

పరిశ్రమలకు తోడ్పాటు

రాయదుర్గం: జీన్స్ వస్త్ర పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, వ్యాపారులు సద్వినియోగం చేసుకుని మరింత విస్తరించుకోవాలని నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ (ఎన్‌పీసీ) సంజన్న పేర్కొన్నారు. రాయదుర్గంలోని రెడిమేడ్ వస్త్ర భవనంలో గురువారం 'లీన్' పథకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా 'లీన్' పథకం అమలులో ఉందన్నారు. దేశంలో పలు రంగాలకు చెందిన పరిశ్రమల యజమానులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. గతంలో 8 మంది గ్రూపుగా ఉంటే 80 శాతం రాయితీ వర్తించేదన్నారు. ప్రస్తుతం ఆ నిబంధనలేవీ లేవన్నారు. పరిశ్రమలు ఎన్ని నెలకొల్పినా ప్రభుత్వ రాయితీ 95 శాతం వర్తిస్తుందని, 5 శాతం యజమాని వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యర్థాలను తగ్గించడం, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉత్పత్తి పద్ధతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వస్త్ర సంఘం అధ్యక్షుడు టీ హనుమంతు, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి జేపీ దుర్గేష్, లీన్ కన్సల్టెన్సీ నైపుణ్యాభివృద్ధి ప్రతినిధి చక్రవర్తి, అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసులు, కౌన్సిలర్ కొంతెం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేయూత

- రూ.5 కోట్ల విలువ చేసే వైద్య సామగ్రి అందజేసిన 'కియా'



కియా సీఏఓ డాంగ్‌లీని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియా కంపెనీ చేయూత అందించింది. గురువారం రూ.5 కోట్ల విలువ చేసే హెచ్‌డీ ఐవస్, రోటా ప్రొ, ఎఫ్ఎస్ఆర్ తదితర వైద్య సామగ్రి అందజేసింది. ఈ సందర్భంగా కియా ఇండియా సీఏఓ డాంగ్‌లీని మంత్రి సత్యకుమార్ సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కియా తరహాలో అన్ని కంపెనీలు ప్రభుత్వాస్పత్రికి చేయూతనివ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేక నిధుల కోసం అంతర్జాతీయ ఏజెన్సీ ద్వారా కృషి చేస్తామన్నారు. ఆర్థిక వనరుల కొరత ఉన్నందున పరిమితులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి సహకారం కోరుతున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించి ఆరోగ్యానికి ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మార్చుతామన్నారు. ప్రతి సీహెచ్‌సీలో రూ. 45 వేల విలువ చేసే గుండె సంబంధిత మందులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 0-18 ఏళ్ల పిల్లలకు వచ్చే నెలలో 44 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి పడకల సంఖ్యను 1,200కి పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ సుబ్రమణ్యం, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందకపోతే ఎలా?

- కార్యాలయాల్లో కూర్చొని ఏం చేస్తున్నారు
- ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఐఏబీ సమావేశంలో అధికారులకు ఆర్థికశాఖ మంత్రి కేశవ్ ఆదేశం





మాట్లాడుతున్న మంత్రి కేశవ్, చిత్రంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హాజరైన ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు

అనంతపురం సెంట్రల్: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజాప్రతినిధులు సమావేశానికి గైర్హాజరయ్యారు.జిల్లా ప్రజాప్రతినిధుల కోసం ఏకంగా గంటన్నర ఎదురుచూడాల్సి వచ్చింది. ఆర్థికశాఖ మంత్రి కేశవ్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది టీబీ డ్యాం నుంచి 26.368 టీఎంసీలు హెచ్చెల్సీకి కేటాయించారని తెలిపారు. 10 టీఎంసీలు తాగునీటికి, 16 టీఎంసీలు సాగునీటికి వెచ్చించనున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఆయకట్టుకు నీరందని చోటే కాకుండా అందుతున్న ప్రాంతాల్లోనూ రైతులకు సంతృప్తి లేదన్నారు. 300 క్యూసెక్కుల లోపే నీటిని విడుదల చేస్తుండటంతో నష్టపోతున్నారన్నారు. కార్యాలయాల్లో అధికారులకు ఎలాంటి పనులు లేవని, హెచ్చెల్సీ అధికారులే కాకుండా హంద్రీనీవా, మైనర్ ఇరిగేషన్ అధికారులు కూడా నీటి పంపిణీలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఫొటోలను కలెక్టర్‌కు పంపాలని సూచించారు. మిడ్‌పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్స్‌కు ఈనెల 23 నుంచి నీరివ్వాలని ఆదేశించారు. ఈనెల 22న జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలనకు నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడు వస్తున్నట్లు తెలిపారు.

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పీఏబీఆర్ ద్వారా ధర్మవరం చెరువును నింపాలని కోరారు. చివరి ప్రాంతాలకు సక్రమంగా నీరు చేరడం లేదని, అధికారులు ఉదాసీనత వీడాలన్నారు.
- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద చివరి ఆయకట్టుకు నీరు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గతేదాది కూడా మిరప సాగు చేసుకుని నష్టపోయారని గుర్తు చేశారు. ఈ సారి పంటలు పండితేనే ఆ ప్రాంత రైతులకు తినడానికి తిండి దొరుకుతుందని పేర్కొన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపడుతున్న సమయంలో భూగర్భ జలాల వృద్ధి కోసం కాలువ అడుగుభాగాన లైనింగ్ చేయరాదని సూచించారు.
- తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ మిడుతూరు వద్ద కాలువ మరమ్మతులు చేపట్టాలని, చాగల్లు నుంచి పెండేకల్లు మార్గంలో కూడా ఇలాంటి పరిస్థితే ఉందని వివరించారు. తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్‌కు వారం రోజులు ఆలస్యమైనా ఫర్వాలేదు కాలువల్లో పూడికతీత, మరమ్మతులు చేయాలని కోరారు.
- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ త్వరగా నీటిని విడుదల చేయకపోతే రైతుల వలసలు, ఆత్మహత్యలు చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి కాకుండా 130 రోజులు నిర్విరామంగా నీరు విడుదల చేయాలని కోరారు.
- గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గుంతకల్లు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు నీటిని విడుదల చేయాలని, హంద్రీనీవా ద్వారా చెరువుల ట్నంటినీ నింపాలని కోరారు.
- రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఆధునికీకరణ పనులు చేపట్టలేదని, 2025 వరకూ పనులు చేయరాదనే నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. బీటీపీ ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులు నింపడంతో పాటు బీటీపీకి 2 టీఎంసీల నీటిని అందించే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. తొలుత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో చెరువులను కృష్ణాజలాలతో నింపుతామని ఇచ్చిన హామీని నెరవేర్చుతామని రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు.
- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ నగరానికి వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా నీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. నేషనల్ పార్కు దగ్గర చెక్‌డ్యాంను వెంటనే నీటితో నింపాలని డిమాండ్ చేశారు.

ఐఏబీ తీర్మానాలిలా..

ఐఏబీ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించడంతో పాటు పనులు వెంటనే ప్రారంభించాలని తీర్మానించారు. కాలువకు అడుగుభాగాన లైనింగ్ పనులు చేయరాదనే తీర్మానంతో పాటు మరో రెండు అంశాలకు ఆమోదం తెలిపారు.

క్లుప్తంగా

కౌలు రైతు ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

కూడేరు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కొర్రకోడుకు చెందిన చాకలి శేఖర్ (35)కు భార్య లావణ్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుల వృత్తితో జీవనం సాగిస్తున్న శేఖర్... ఆరేళ్లుగా ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేసేవాడు. వర్షాభావంతో పంటలు సరిగా పండక నష్టాల పాలవుతూ వచ్చాడు. ఈ క్రమంలో పంట సాగుకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలోనంటూ మదనపడుతూ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైల్వే పోలీసుల అదుపులో సైబర్ నేరగాళ్లు

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఉదయం ఇద్దరు సైబర్ నేరగాళ్లను అనంతపురం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ధర్మవరానికి చెందిన ఖాదర్‌బాషాతో పాటు మరో వ్యక్తి ఉన్నాడు. నిందితులను అనంతపురానికి తరలించి లోతైన విచారణ చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రావత్ దూకుడు... సంజు మెరుపులు

- సూపర్ సెంచరీతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచిన ఎస్.రావత్
- అర్ధ సెంచరీలతో రాణించిన సంజు, శ్రీకర్ భరత్, రిక్కీ భుయి
- ఇండియా–ఏ 224/7
- ఇండియా–డీ – 306/5



ములాని కొట్టిన బంతిని ఒడిసి పట్టుకుంటున్న ఫీల్డర్



సెంచరీ సాధించిన తర్వాత అభివాదం చేస్తున్న రావత్

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఏసీఏ, ఏడీసీఏ సౌజన్యంతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఇండియా–ఏ జట్టు బ్యాటర్ ఎస్.రావత్ సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఇండియా–సీ జట్టుపై ఇండియా–ఏ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 224 పరుగులు సాధించింది. అలాగే ఇండియా–బీ జట్టుపై ఇండియా–డీ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 306 పరుగులతో భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఇండియా– డీ జట్టు బ్యాటర్ సంజు శామ్సన్ 89 పరుగులతో అజేయంగా నిలిచాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయి అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేశాడు.

36 పరుగులకే పీకల్లోతు కష్టాల్లోకి

ఇండియా–ఏ, సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా–సీ జట్టు టాస్ గెలిచి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సీ జట్టు పేసర్ల ధాటికి ఇండియా–ఏ జట్టు 36 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాలోకి కూరుకుపోయింది. ప్రథమ్ సింగ్ 6, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 6, తిలక్ వర్మ 5, రియాన్ పరాగ్ 2, కుమార్ కుషాగ్రా డకౌట్ అయ్యారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ఎస్.రావత్, ఎస్.ములాని బాధ్యతాయుతంగా ఆడారు. అవకాశం దొరికినప్పుడల్లా సింగిల్స్, డబుల్స్ తీసుకుంటూ బంతులను బౌండరీలుగా మలిచారు. జట్టు స్కోరు 123 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఎస్.ములాని 44 (5 ఫోర్లు, 1 సిక్సర్) పరుగుల వద్ద గౌరవ్‌యాదవ్ బౌలింగ్‌లో పటిదార్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆరో వికెట్ భాగస్వామ్యానికి 104 పరుగులు జోడించారు. ఈ దశలో ఎస్.రావత్ దూకుడు పెంచాడు. ఆట ముగిసే సమయానికి 235 బంతుల్లో 122 పరుగులు (15 ఫోర్లు) నాటౌట్‌గా క్రీజులో నిలిచాడు. మరో బ్యాటర్ అవేశ్‌ఖాన్ 16 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఇండియా సీ జట్టు బౌలర్లలో అన్షుల్ కాంభోజ్ 3, విజయ్‌కుమార్ వైశాఖ్ 2 వికెట్లు తీశారు.

పటిష్ట స్థితిలో ఇండియా–డీ

మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గి ఇండియా–బీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా–డీ జట్టు 77 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్లు దేవదత్ పడిక్కల్, శ్రీకర్ భరత్ అర్ధ సెంచరీలతో చెలరేగారు. తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 50 పరుగులు చేసిన పడిక్కల్‌ను నవదీప్‌సైనీ పెవిలియన్ దారి పట్టించాడు. మరో ఓపెనర్ శ్రీకర్ భరత్ 105 బంతుల్లో 52 (9 ఫోర్లు) పరుగులు చేశాడు. వన్ డౌన్‌లో వచ్చిన రికీ భుయి సైతం 87 బంతుల్లో 56 (8 ఫోర్లు) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయ్యాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సంజు శామ్సన్ మెరుపులు మెరిపించాడు. అవకాశం దొరికినప్పుడు బంతిని సిక్సర్, బౌండరీగా మలిచాడు. 83 బంతుల్లో 89 పరుగుల (10 ఫోర్లు, 3 సిక్సర్లు)తో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ 26 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఇండియా–బీ జట్టు బౌలర్లలో రాహుల్ చహార్ 3 వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ కుమార్, నవదీప్ సైనీ చెరో వికెట్ తీశారు.





మ్యాచ్‌ను చూస్తూ కేరింతలు కొడుతున్న అభిమానులు

యువకుడి అనుమానాస్పద మృతి

తాడిపత్రి అర్బన్: స్థానిక కృష్ణాపురం మొదటి రోడ్డులో నివాసముంటున్న మహబూబ్‌బాషా (18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాడిపత్రి అర్బన్ సీఐ సాయి ప్రసాద్ తెలిపిన మేరకు... వెల్డింగ్ పనులతో కుటుంబానికి చేదోడుగా ఉన్న మహబూబ్‌బాషా కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మూర్ఛ రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కోలుకున్న వెంటనే ఇంటికి చేరుకున్న మహబూబ్‌బాషా గురువారం తెల్లవారేసరికి మరణించాడు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రిష్టిపాడు విద్యార్థి



ఎంపికైన విద్యార్థి రాజశేఖర్

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న రాజశేఖర్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ అన్నవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొన్న రాజశేఖర్ తనదైన ఆటతీరుతో సెలక్టర్ల దృష్టిని ఆకట్టుకుని ఏపీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 25న హర్యానాలోని రోతక్ జిల్లాలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.

డీఎంహెచ్‌ఓ ఘెరావ్



డీఎంహెచ్‌ఓని అడ్డుకుంటున్న ఆశా వర్కర్లు

అనంతపురం మెడికల్: డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవిని గురువారం ఆశా వర్కర్లు ఘెరావ్ చేశారు. పీహెచ్‌సీల్లో తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. డిమాండ్లు విన్న తర్వాత డీఎంహెచ్‌ఓ సానుకూలంగా స్పందించారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, ఏఐటీయూసీ రాజేష్, నాయకులు కృష్ణుడు, అనిల్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమీపిస్తున్న రబీ

- సన్నాహక చర్యలపై దృష్టి సారించని వ్యవసాయశాఖ
- 80 వేల హెక్టార్లలో ప్రధానపంటగా పప్పుశనగ సాగు అంచనా

అనంతపురం అగ్రికల్చర్: మరో 12 రోజుల్లో ఖరీఫ్ ముగిసి రబీ పంట కాలం ప్రారంభం కానుంది. రబీ సాగుకు కీలకమైన అక్టోబర్‌లో నైరుతి రుతుపవనాలు వెనక్కు వెళ్లి 15 నుంచి ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమవుతాయి. దీనికి తోడు తుఫాన్ల ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉంటుందని అంచనా. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీకి ప్రాధాన్యత తక్కువే అయినా ప్రధాన పంటగా 80 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పప్పు శనగ సాగయ్యే అవకాశం ఉంటుందని అంచనా. అలాగే వేరుశనగ 20 వేల హెక్టార్లు, ఇరత పంటలు 20 నుంచి 30 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉందని ఇప్పటికే అంచనా వేశారు. మొత్తమ్మీద 1.20 లక్షల హెక్టార్లలో రబీ పంటలు సాగులోకి రానున్నా... ఇప్పటికీ ఇందుకు సంబంధించిన సన్నాహకాలపై వ్యవసాయ శాఖ దృష్టి సారించకపోవడం గమనార్హం. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు పప్పుశనగ సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాలు కురిస్తే కొందరు రైతులు అక్టోబర్ మొదటి వారంలోనే విత్తు వేసేలా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ లోపు రైతులకు రాయితీతో విత్తన పప్పుశనగ ఇవ్వాల్సివుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ అక్టోబర్ మొదటి వారంలోనే విత్తనాన్ని పంపిణీ చేశారు. ఈ సారి ఇంకా దృష్టి సారించకపోవడంతో విత్తన పంపిణీ ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల నల్లరేగడి భూములు కలిగిన ప్రాంతాల్లో పత్తి సాగు గణనీయంగా తగ్గిపోయింది. భూములు బీళ్లుగానే ఉన్నందున వర్షాలు వస్తే రబీలోనైనా పంటలు సాగు చేయాలని రైతులు ఆశగా ఉన్నారు.

రాష్ట్రంలో పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

- ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో పేద, సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. గురువారం అనంతపురంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా మెడికల్ సీట్లు రాకుండా సీఎం చంద్రబాబు అడ్డుకుని తన చేతకాని తనాన్ని బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నాడు లేని విధంగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాది పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరులో వైద్య కళాశాలలు ప్రారంభం కావడంతో 750 సీట్ల భర్తీకి అనుమతులు దక్కాయన్నారు. అయితే పేదలు వైద్య విద్యను అభ్యసించరాదనే నైజం కలిగిన సీఎం చంద్రబాబు... ఉద్దేశపూర్వకంగా వైద్య సీట్లు వద్దని ఎన్‌ఎంసీకి లేఖ రాసి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. 2014– 2019లో యాజమాన్య కోట ఫీజులు రూ.5లక్షల నుంచి రూ.24 లక్షలకు పెంచి విద్యార్థుల తల్లిదండ్రుల మీద పెను భారం మోపారని గుర్తు చేశారు. ఎన్‌ఎంసీకి రాసిన లేఖను ఉపసంహరించుకుని తక్షణమే 750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి చర్యలు తీసుకోకపోతే విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకుని ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని హెచ్చరించారు.

నాలుగు ఇసుక బండ్ల పట్టివేత

- బండికి రూ.2వేలు చొప్పున జరిమానా



పోలీసుల అదుపులో ఉన్న ఎద్దుల బండ్లు

పామిడి: స్థానిక పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న నాలుగు ఎద్దుల బండ్లను సీఐ యుగంధర్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి అదుపులోకి తీసుకుని ఒక్కో ఎద్దులబండి యజమానికి రూ.2 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. విషయం తెలియగానే పామిడి వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా స్థానికంగా గృహ నిర్మాణ అవసరాలు, ఇతర అభివృద్ధి పనులకు ఎద్దుల బండిపై ఇసుక సరఫరా చేస్తూ పదుల సంఖ్యలో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెన్నానదిపై సర్వ హక్కులు తమవేనంటూ టీడీపీ నాయకులు వ్యవహరిస్తూ పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని నిరుపేదల ఆర్థిక వనరులను దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు.

ఒకరికి జీవిత ఖైదు

- మరో ఏడుగురికి ఏడేళ్ల జైలు శిక్ష
- కిడ్నాప్, హత్య కేసులో అనంతపురం కోర్టు సంచలన తీర్పు

అనంతపురం: భారీగా డబ్బు కాజేయడమే కాకుండా ఈ విషయం ఎక్కడ బయటపడుతుందోనన్న ఉద్దేశంతో ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి ఆ తరువాత హతమార్చిన కేసులో అనంతపురం నాల్గో సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ముద్దాయిల్లో ఒకరికి జీవిత ఖైదు, మరో ఏడుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. వివరాలు... అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన భాగ్యలక్ష్మి, ఆమె తమ్ముడు విజయమోహన్ 2015, సెప్టెంబర్ 12న పామిడికి వెళ్లిన సమయంలో కిడ్నాప్‌కు గురయ్యారు. ఆ తర్వాత బెదిరించి వారి బ్యాంక్ ఖాతాల్లోని రూ.47 లక్షలు విత్ డ్రా చేయించి, తీసుకున్నారు. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు విజయమోహన్‌ను అదే సంవత్సరం డిసెంబర్ 25న గొంతు నులిమి హతమార్చి, మృతదేహాన్ని నీటి కాలువలో పడేశారు. అదే ఏడాది డిసెంబర్ 31న భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పామిడి సీఐ రవిశంకరరెడ్డి పక్కా ఆధారాలతో బసిరెడ్డి రమేష్‌రెడ్డి, కె.సూర్యనారాయణరెడ్డి, ఎల్.సుదర్శన్‌రెడ్డి, ఆర్.లక్ష్మి, ఎం.నాగరాజు, ఎం.చంద్రాయుడు, సి.హరినాథరెడ్డి, ప్యాపిలి మురళిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు కొనసాగుతూ వచ్చాయి. మొత్తం 13 మంది సాక్షులను న్యాయమూర్తి శోభారాణి విచారించారు. నేరం రుజువు కావడంతో బసిరెడ్డి రమేష్‌రెడ్డికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పువెలువరించారు. మిగిలిన ఏడుగురు ముద్దాయిలకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు మొత్తం 8 మందికి చెరో రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను పీపీ సృజన వినిపించారు. కేసులో బలమైన సాక్ష్యాలు సేకరించి ముద్దాయిలకు శిక్ష పడేలా చేసిన సీఐ రవిశంకరరెడ్డి, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ ప్రతాపరెడ్డి, కోర్టు లైజర్ ఆఫీసర్/ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుళ్లు సారెడ్డి, లక్ష్మీనారాయణను ఎస్పీ జగదీష్ అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిపత్రి రూరల్: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం యుగుడూరు సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో అటుగా ఇసుక లోడుతో వస్తున్న మూడు ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద తరలింపులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

జేఎన్‌టీయూ పరిధిలోకి 'స్కిట్'?

- శ్రీకాళహస్తి దేవస్థానం ఆధీనంలోని సాంకేతిక విద్య కళాశాలను జేఎన్‌టీయూ పరిధిలోకి మార్చే ప్రయత్నాలు
- కళాశాలను తాము నిర్వహించలేమని.. ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని గతంలోనే కోరిన దేవస్థానం పాలకమండలి
- పరిశీలనకు నలుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించిన ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ



శ్రీకాళహస్తీశ్వరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రవేశ ద్వారం

అనంతపురం: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌కేఐటీ – స్కిట్)ని జేఎన్‌టీయూఏ పరిధిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. జేఎన్‌టీయూఏ కానిస్టిట్యూట్ కళాశాలగా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ఇదే జరిగితే జేఎన్‌టీయూఏ పరిధిలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, ఓటీపీఆర్ఐ, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు స్కిట్ కానిస్టిట్యూట్ హోదా పొందనుంది. ఒకవేళ కానిస్టిట్యూట్ కళాశాలగా నిర్ధారిస్తే పాటించాల్సిన విధివిధానాల రూపకల్పనకు సిఫారసు చేసేందుకు ఓ కమిటీని నియమించారు. కమిటీకి చైర్మన్‌గా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, కన్వీనర్‌గా ఉన్నత విద్యా మండలి సెక్రెటరీ, సభ్యులుగా దేవాదాయ శాఖ కమిషనర్, జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ఈ నెల 20వ తేదీలోపు నివేదికను కమిటీ సభ్యులు అందజేయనున్నారు.

మహోన్నత ఆశయంతో ఏర్పాటు

ఆదాయం ప్రధానం కాకుండా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే మహోన్నత ఆశయంతో 1997లో స్కిట్‌ను శ్రీకాళహస్తీశ్వర ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జేఎన్‌టీయూఏ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. రాష్ట్రంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఏకైక కళాశాల కావడం, నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు రాబట్టడంతో అనతి కాలంలోనే స్కిట్‌కు మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. ఆ తర్వాత మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా కళాశాల నిర్వీర్యమవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే 2013 నుంచి అత్తెసరు అడ్మిషన్లతో నిర్వహణ భారమైంది. ఈ క్రమంలోనే 2019 నాటికి కళాశాల పరిస్థితి పూర్తి అధ్వాన స్థితికి చేరుకుంది. దీంతో కళాశాలను జేఎన్‌టీయూఏ పరిధిలోకి చేర్చాలంటూ ఆలయ పాలక మండలి సభ్యులు తీర్మానం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే సాంకేతిక కారణాలు చూపుతూ ఈ అంశాన్ని అప్పటి ప్రభుత్వం మరుగున పడేసింది. తాజాగా మరోసారి ఇదే అంశానికి ఆలయ పాలక మండలి తెరపైకి తేవడంతో సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీని ఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసింది. ఒకవేళ స్కిట్‌కు జేఎన్‌టీయూఏ కానిస్టిట్యూట్ హోదా దక్కితే పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో సాంకేతిక విద్య అందుబాటులో రానుంది.

జేసీబీని అడ్డుకుని పోలీసులకు అప్పగించిన రైతులు



జేసీబీని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

శింగనమల: వంకలోని ఇసుకను వెలికి తీసేందుకు టీడీపీ నాయకులు తీసుకువచ్చిన జేసీబీని రైతులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... శింగనమల మండలంలో కొన్ని రోజులుగా టీడీపీ నాయకుల ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పి.జలాలపురం వంకలో నుంచి ఇసుకను వెలికి తీసేందుకు ఓ జేసీబీ, టిప్పర్లను గురువారం రాత్రి 7 గంటల సమయంలో తీసుకెళ్లారు. విషయాన్ని పసిగట్టిన గ్రామంలోని రైతులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకుని వాహనాలను అడ్డుకున్నారు. ఆ సమయంలో టిప్పరు డ్రైవర్లు చాకచక్యంగా తమ వాహనాలను దారి మళ్లించి అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో జేసీబీ డ్రైవర్‌ను పట్టుకుని డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో సీఐ కౌలుట్లయ్య, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి జేసీబీని అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీనిచ్చారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని రాయల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భం దాల్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 'బేటీ బచావో బేటీ పడావో' ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలతో పౌష్టికాహారాలను ప్రదర్శించారు. అనంతరం గర్భిణికి సీమంతం చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, సుజాత, ఎమ్మెస్కే నజ్మా, సచివాలయ సిబ్బంది అల్లీపీరా పాల్గొన్నారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ

కనగానపల్లి: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద గురువారం ఏఓ కృష్ణకుమారి ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాభావంతో వేరుశనగ సాగు చేసుకోలేని రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ధరతో ఉలవలు, అలసందలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు అందజేస్తోందన్నారు. వీటిని రైతులు వినియోగించుకుని పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకె రామక్రిష్ణ, ఎంపీటీసీ భాస్కర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో దాత కొండప్ప

రాప్తాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల కేంద్రానికి చెందిన పంపు కొండప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 ఖోఖో క్రీడాకారులకు పంపు వన్నమ్మ జ్ఞాపకార్థం 15 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొండప్ప సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబశివా, పీడీలు రాజశేఖర్ రెడ్డి, ఎస్.కేశవమూర్తి, సీనియర్ క్రీడాకారులు చిట్రా ఆదినారాయణ, తరుణ్, చైతన్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ సుబ్బర హేమలత సూచించారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని తరగతి గదులను పరిశీలించారు. రికార్డులు ఇవ్వాలని వార్డెన్‌ను కోరగా.. రికార్డు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో తమ ఉన్నత అధికారికి పరిశీలనలకు ఇచ్చామని సమాధానమిచ్చారు. అలా ఎలా చేస్తారంటూ వార్డెన్‌ను ప్రశ్నించారు. అనంతరం సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలతో కూరలు వండాలని సూచించారు. భోజనం నాణ్యతగా ఉండాలని తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. భోజనం ఎలా ఉందని పలువురు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం, శనివారం (రెండు రోజుల పాటు) ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ నాగరాజు గురువారం తెలిపారు.

రాప్తాడులో..

రాప్తాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్లు ఎస్.కేశవ మూర్తి, బి.రాజశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగంలో మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.



కాలేజీల్లో సీట్లు తగ్గించడం దుర్మార్గం

రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు పెరగడంతో సీట్లు పెరుగుతాయని నీట్ రాసిన విద్యార్థులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. ప్రభుత్వ ధోరణి సరికాదు. అహర్నిశలూ శ్రమించి వైద్య విద్య కలను సాకారం చేసుకునేందుకు ఎదురు చూస్తున్న తరుణంలో కాలేజీల్లో సీట్లు తగ్గించడం సబబు కాదు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. మా అన్న కూతురికి నీట్ పరీక్షల్లో గణనీయమైన ర్యాంకు వచ్చింది. ప్రైవేట్‌పరం చేస్తే ఫీజులు కట్టి చదవాల్సిన పరిస్థితి వస్తుంది.

– బి.రాజశేఖర్ రెడ్డి, అనంతపురం



ప్రభుత్వ వైఖరి సరిగా లేదు



కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు విషయంలో ప్రభుత్వ వైఖరి సరిగా లేదు. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ కాలేజీలు వచ్చి మెడికల్ సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇది ఆలోచించకుండా ప్రభుత్వం మంజూరైన సీట్లను కూడా రద్దు చేస్తామనడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి నో చెప్పడం ఏమిటో అర్థం కావడం లేదు.

– సాకే హరీష్, రామగిరి మండలం

ఐఏబీలో తమ్ముళ్ల హంగామా

కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో టీడీపీ నేతలు హంగామా చేశారు. మీటింగ్ జరుగుతుండగా పెద్ద సంఖ్యలో వచ్చిన టీడీపీ నాయకులు ఫోన్లలో మాట్లాడుతూ అధికారులకు ఇబ్బంది కలిగించారు. ఇతర అధికారులు కూర్చోవడానికి అవకాశం లేకుండా కుర్చీలు వేసుకున్నారు. వీళ్లందరినీ ఎవరు అనుమతించారు? బయటకు వెళ్లి కూర్చోండి అని డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి టీడీపీ నాయకులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మరోసారి కలెక్టర్ వినోద్ కుమార్ కల్పించుకుని టీడీపీ నాయకులను బయటకు పంపించాలని డీఎస్పీకి ఆదేశాలు జారీ చేసినా ఎవ్వరు కూడా బయటకు వెళ్లలేదు. టీడీపీ నాయకుల గందరగోళం మధ్య సమావేశం కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



మీటింగ్ హాల్‌లో అధికారులకు వేసిన కుర్చీల్లో కూర్చున్న టీడీపీ నేతలు



మీటింగ్ జరుగుతుండగా ఫోన్‌లో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు



అధికారులు కూర్చొనేందుకు వీలు లేకుండా కుర్చీలు వేసుకున్న దృశ్యం



సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్న నాయకులు

ఎస్క్రో ఖాతా ద్వారా జీతాలు చెల్లించండి

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లగా పని చేస్తున్న ఉద్యోగులకు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్క్రో ఖాతాల ద్వారా జీతాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని మీటర్ రీడర్స్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి నెల సకాలంలో విద్యుత్ బిల్లులు వినియోగదారులకు అందించే విధంగా గత కొన్నేళ్లుగా పని చేస్తున్నామన్నారు. స్పాట్ బిల్లింగ్ టెండర్ల కాంట్రాక్టర్ల ద్వారా వేతనాలు చెల్లించే వారన్నారు. దీంతో మీటర్ రీడర్లు ప్రతి నెల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కాంట్రాక్టర్లు పీఎఫ్, ఈఎస్ఐలు సైతం సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్క్రో ఖాతా ద్వారా జీతాలు చెల్లించడంతోపాటు మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్ల సంఘం నాయకులు కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రాము, భరత్, వన్నూర్‌స్వామి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఈ సంపత్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైతులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. చెరువులను నీటితో నింపాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీపీఐఎం, సీపీఐ, రైతు సంఘాల నాయకులు విన్నవించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఐఏబీ సమావేశానికి విచ్చేసిన మంత్రిని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, చిరుతల మల్లికార్జున, తదితరులు వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా, రైతు సంక్షేమం దిశగా ఐఏబీ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవాలని మంత్రిని కోరారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ చేపట్టాలని కోరారు. పెన్నా అహోబిలం రిజర్వాయర్‌లో సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలన్నారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. హంద్రీ-నీవా పంటల కాలువ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. నీటి పారుదల కాలువతో చెరువులు, కుంటలను అనుసంధానం చేయాలన్నారు. ఆయకట్టుకు 130 రోజుల సాగునీరు ఇవ్వాలని విన్నవించారు. హెచ్‌ఎల్‌సీ కింద చివరి ఆయకట్టుకు, హంద్రీ-నీవా కింద నిర్దేశించిన 3.50 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించి సాగు, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు పి.నారాయణస్వామి, చెన్నప్ప యాదవ్, రామాంజనేయులు, లింగమయ్య, అల్లీపీరా, నల్లప్ప, నాగేంద్రకుమార్, రామిరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మొబైల్ వ్యాపారులను కాపాడాలి

అనంతపురం అర్బన్: అనంతపురం నగరంలో మార్వాడీలు కారణంగా వీధిన పడే పరిస్థితి నెలకొందని మొబైల్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి నుంచి తమను కాపాడాలంటూ మొబైల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ వర్కర్ల సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. వందల మంది విద్యావంతులు మొబైల్ రిపేరీ షాపులు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. అయితే రాజస్థాన్ నుంచి ఇక్కడి వచ్చి అడ్డగోలుగా వ్యాపారం చేస్తున్న మార్వాడీల కారణంగా స్థానికంగా మొబైల్ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు వెయ్యి కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రధానంగా కమలా నగర్ ప్రాంతంలో మార్వాడీలు అనుమతులు లేకుండానే షాపులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక మొబైల్ వ్యాపారులను వీరు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చివరికి స్థానికులనే వెళ్లగొట్టే పరిస్థితికి వచ్చారన్నారు. వీరి చర్యలకు అడ్డుకట్ట వేసి స్థానిక మొబైల్ వ్యాపారులను కాపాడాలన్నారు. లేకపోతే తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణ స్వామి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు శ్రీరాములు, పోతులయ్య, ఆనంద్, ఓబుళపతి, శాంతకుమార్, నాగేష్, మొబైల్ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, నాయకులు ఉమర్‌షారూక్, హరీంద్ర, రంజిత్, మధు, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొబైల్ కార్మిక సంఘం నాయకుడు

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం

అనంతపురం కల్చరల్: మనిషిని నైతిక విలువలతో నడిపించి మానసిక ప్రశాంతతను చేకూర్చే భక్తిమార్గంలో అందరూ పయనించాలని శ్రీబాలకృష్ణానంద మహాసంస్థానం శంకర పీఠం పీఠాధిపతి గోవిందానంద సరస్వతి ప్రబోధించారు. హైందవ ధర్మప్రచారంలో భాగంగా దక్షిణ భారత దేశయాత్రలు చేస్తూ చాతుర్మాస దీక్షల కోసం గోవిందానంద సరస్వతి శ్రీశైలం వెళ్లారు. దీక్షలు ముగించుకుని కర్ణాటకలోని పీఠానికి వెళ్తున్న స్వామీజీ మార్గమధ్యమంలో గురువారం అనంతకు విచ్చేశారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయానికి వచ్చిన స్వామీజీకి ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రహ్మణ్యం నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ స్వయంగా కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం, శారదామాతకు, కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో ప్రవచనం చేశారు. అంతకు ముందు పీటీసీలో సిద్ధి వినాయకుడి ఆలయంలో వేదపండితులు సుంకేశుల సత్యనారాయణతో కలిసి పూజలు చేసి తీర్థప్రసాదాలనందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, పరమేష్, నరసింహ శాస్త్రి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



మొదటి రోడ్డు శివాలయంలో పూజలు చేస్తున్న గోవిందానంద సరస్వతి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

అనంతపురం మెడికల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థలో గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో పారిశుధ్యం మెరుగుకు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయంలో ఉంటారని.. వారు కూర్చునే ప్రదేశాల్లో పాత రికార్డులు ఉంటే వాటిని భద్రంగా మరో ప్రదేశంలో ఉంచుకోవాలన్నారు. దుమ్ము, ధూళి ఎక్కువగా ఉంటే పలు రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. మనం ఉండే ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ద్వారా పారిశుధ్యం మెరుగులో ప్రజల భాగస్వామ్యాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ వసీం, చిత్రంలో కమిషనర్ నాగరాజు

మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి విశేష కృషి

అనంతపురం అగ్రికల్చర్: ఒకటిన్నర ఏడాది పాటు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా ఆర్.జయలక్ష్మి మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల సంక్షేమానికి విశేష కృషి చేశారని యార్డు అధికారులు, సిబ్బందితో పాటు చీనీ వ్యాపారులు కొనియాడారు. డెప్యుటేషన్‌పై కర్నూలు మార్కెట్‌యార్డుకు బదిలీపై వెళుతున్న ఆర్.జయలక్ష్మిని గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు పాలకమండలి భవనంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గతేడాది మార్చిలో బాధ్యతలు తీసుకున్న సెక్రటరీ మార్కెటింగ్ ఫీజు వసూళ్లు, సంతల ద్వారా ఆదాయం పెంచి లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమించడానికి చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. చీనీ రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా ఓపెన్ షెడ్ ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్-2 సెక్రటరీ రూప్‌కుమార్, రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల సెక్రటరీలు రామ్‌ప్రసాద్, ఆనంద రావు, కేదార్‌నాథ్, సూపర్‌వైజర్లు కేశవ కుమార్, కృపావతి, నాగేంద్ర, యూడీసీలు మల్లిక, తిరుపాల నాయక్, మురళీతో పాటు పలువురు చీనీ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.



సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మిని సన్మానిస్తున్న యార్డు స్టాఫ్, వ్యాపారులు

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: కేశవరెడ్డి విద్యా సంస్థల జోనల్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యా సంస్థల అధినేత నాగిరెడ్డి కేశవరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. వడియంపేట, మారుతీనగర్, సాయినగర్ బ్రాంచ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శారీరక ధారుడ్యం, మానసిక ఆరోగ్యం, విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు తోడ్పడుతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.

గుణాత్మక విద్య అందించాలి



సూచనలిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

చెన్నేకొత్తపల్లి: పాఠశాల విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలి. సులభంగా అర్థమయ్యేలా బోధించాలని రిసోర్స్‌పర్సన్లు రవి కుమార్, నబీరసూల్, గోవిందు, కాంతరాజు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లు మాట్లాడుతూ.. ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధనలో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు వీరగాథలపై వ్యాస రచన పోటీలను నిర్వహించాలని తెలిపారు. అలాగే హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే స్వచ్ఛత పక్వాడా అంశంపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు, జూనియర్ కళాశాల, బళ్లారి బైపాస్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2014–19 సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను తీసుకువచ్చారన్నారు. ఆగస్టు 15 నుంచి దశల వారీగా అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, కమిషనర్ నాగరాజు, మాజీ మేయర్ మదమంచి స్వరూప, టీడీపీ నాయకులు ఆదినారాయణ, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఎంఎన్‌ఓలకు సీపీఆర్‌పై శిక్షణ



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఎమర్జెన్సీ మెడిసిన్ నూరుల్లా

అనంతపురం మెడికల్: గుండె సంబంధిత సమస్యతో గుండె ఆగిపోయిన వారికి అత్యవసర చికిత్సనందించే సీపీఆర్ విధానంపై ఆస్పత్రిలో మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌ఓ)లకు గురువారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత పర్యవేక్షణలో ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నూరుల్లాఖాన్ ఎంఎన్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. గుండె ఫెయిల్యూర్ అయిన వారి ఛాతిపై కొన్ని సార్లు ఒత్తి, అనంతరం గొంతు వద్ద పల్స్ చూడటం, అవసరమైతే నోటి ద్వారా శ్వాసను అందించాల్సి ఉంటుందన్నారు. తద్వారా పల్స్ యథాస్థితికి తీసుకురావచ్చే విధానాన్ని ఎంఎన్‌ఓలతో డెమో చేయించారు. డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. రోగులకు అత్యవసర చికిత్సనందించేందుకు ఆస్పత్రిలోని ఎంఎన్‌ఓలకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. మూడో రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వారికి సూపరింటెండెంట్ ద్వారా సర్టిఫికెట్లను అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'హామీలను బీజేపీ విస్మరించింది'



ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

రాప్తాడు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలను వంచించాయని గురువారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అందరికీ పక్కా ఇల్లు ఇస్తామని, మహిళా రిజర్వేషన్లు పార్లమెంట్‌లో పాస్‌చేసి ఆచరణలో అమలు చేయలేదన్నారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగేలా ఉందన్నారు. గ్రామీణ కార్మికులకు గొప్ప ఆసరాగా నిలిచిన మహాత్మగాంధీ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు, తాగునీరు ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు టీఎస్ వలి, పరుశురాముడు, సుజాత, విద్యార్థి, యువజన నాయకులు వేమన, శివకుమార్, బాలకృష్ణ, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

